నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడిపల్లి: 11కేవి చెంగిచెర్ల ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా 33/11 కేవీ పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు పీఅండ్‌టీ కాలనీ కమలానగర్, విశ్వం విహార్ కాలనీ, సుమ రెసిడెన్సీ, గురుఎన్‌క్లేవ్, అయోధ్యకాలనీ, భగత్‌సింగ్‌నగర్, భరత్‌పురి కాలనీ, మల్లికార్జుననగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

◆ 11 కేవీ ఎన్‌ఆర్‌సీఎం మీట్ ఫీడర్ పరిధిలో 33/11 కేవీ చెంగిచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు ఎన్‌ఆర్‌సీఎం, కమేళా ఏరియాలో కరెంటు ఉండదని, ఏఈ హరినాథ్ నగ్గు ఓ ప్రకటనలో వివరించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉప్పల్: సత్యానగర్ 11కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా గురువారం 12 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సత్యానగర్, శాంతినగర్, మెహ్ఫిల్ హోటల్, ట్రై కలర్ అపార్టుమెంట్, ఆదిత్య ఆసుపత్రి, స్వరూప్‌రెడ్డి కాలనీ, ఏషియన్ థియేటర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

క్రీడా పోటీల్లో ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రాజు

అల్వాల్: ఉప్పల్ జీహెచ్ఎంసీ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అంతర్ జిల్లా క్రీడల్లో మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 100 మీటర్ల పరుగు పందెంలో బీకాం ద్వితీయ సంవత్సరానికి చెందిన ఉమేష్ ప్రథమ బహుమతి, షటిల్‌లో బీఎస్సీ ద్వితీయ సంవత్సరానికి చెందిన భాను ద్వితీయ బహుమతి సాధించారు. బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రాజు విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు. ఇన్‌చార్జ్ పీడీ డాక్టర్ ఎడ్ల ప్రదీప్, డాక్టర్ అహల్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అడవి రాజు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి



ఆటో యూనియన్ డ్రైవర్లతో శైలేష్‌రెడ్డి

మల్లాపూర్: తెలంగాణ ఘాట్స్ ఆటోయూనియన్ డ్రైవర్ల సమస్యలను మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని, మల్లాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు గూడురు శైలేష్‌రెడ్డి వారికి హామీ ఇచ్చారు. బుధవారం మల్లాపూర్ సూర్యనగర్‌లోని కార్యాలయంలో శైలేష్‌రెడ్డితో సమావేశం నిర్వహించారు. ఆటోడ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. తెలంగాణ ఘాట్స్ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గజేంద్ర తదితరులున్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషి



మాజీ కార్పొరేటర్‌ను సత్కరించిన పారిశుద్ధ్య కార్మికులు

బోడుప్పల్: రూ.5 కోట్లతో డివిజన్ అభివృద్ధికి కృషి చేసినట్లు 13వ డివిజన్ మాజీ కార్పొరేటర్ అనితాయాదగిరి అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులతో ఆమె సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి ప్రజలు నివసించే తమ డివిజన్‌లో రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు ప్రాధాన్యతనిచ్చినట్లు వివరించారు. పారిశుద్ధ్య కార్మికులు నిత్యం డివిజన్‌ను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేసినట్లు చెప్పారు.

జూదరుల అరెస్ట్

ఘట్‌కేసర్: పేకాడుతున్న వ్యక్తులను ఘట్‌కేసర్ పోలీసులు బుధవారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నారు. అడ్మిన్ ఎస్సై ప్రభాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈడబ్ల్యూఎస్ కాలనీలోని ఓ ఇంట్లో పేకాడుతున్నట్లు సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. రాజు, రాంబాబు, సుధాకర్, బాబు, యశ్వంత్, ఆదినారాయణ, మోహన్ అనే వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1.69 లక్షలను స్వాధీనం చేసుకున్నామని, మొబైల్ ఫోన్లను సీజ్ చేశామన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణే లక్ష్యంగా..

- అక్రమంగా నిర్మించిన ప్రహరీ కూల్చివేత
- 3 కిలోమీటర్ల మేర తగ్గిన దూరభారం



ప్రహరీ కూల్చివేయడంతో సులువైన రాకపోకలు

కాప్రా: నగరంలోని చెరువులు, ప్రభుత్వ భూముల పరిరక్షణే లక్ష్యంగా ఏర్పాటు చేసిన హైడ్రా తన బుల్డోజర్లను కాప్రా సర్కిల్ వైపు మళ్లించింది. బుధవారం కాప్రాలోని అక్రమంగా నిర్మించిన కట్టడాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. కాప్రా డివిజన్ ఎస్‌ఆర్‌ఐ కాలనీ సమీపంలోని సర్వేనంబర్ 55లో ప్రహరీ నిర్మాణం చేపట్టారు. ఈ ప్రహరీ నిర్మాణంతో సమీప కాలనీవాసుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురౌతున్నాయని, ఆయా కాలనీవాసులు హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రహరీ ఉండటంతో ప్రధాన రహదారికి చేరుకోవాలంటే సుమారు 3 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తుందన్నారు. స్థానిక సమీప కాలనీవాసుల ఫిర్యాదుతో హైడ్రా అధికారులు ప్రహరీని నేలమట్టం చేశారు. దీంతో నేరుగా ప్రధాన రహదారిని చేరుకోవచ్చని ఆయా కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చర్లపల్లి కబ్జాలపై మంత్రి సీతక్కకు వినతి

కలెక్టర్, హైడ్రా కమిషనర్‌కు సిఫారసు చేసిన మంత్రి



మంత్రి సీతక్కతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

కుషాయిగూడ: చర్లపల్లి ప్రభుత్వ భూమిలో కబ్జాల వ్యవహారం మంత్రి సీతక్క వరకు వెళ్లింది. బుధవారం గాంధీభవన్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో స్థానిక కాంగ్రెస్‌పార్టీ యువ నాయకుడు బూడిద ప్రేమ్‌కుమార్ చర్లపల్లి కబ్జాలపై మంత్రికి ఫిర్యాదు చేశారు. సర్వే నెంబరు 30లో రాత్రికిరాత్రే వెలుస్తున్న అక్రమ నిర్మాణాలను మంత్రికి వివరించారు. సాక్షిలో చర్లపల్లిలో ఆగని కబ్జాలు శీర్షికన ప్రచురించిన కథనాన్ని మంత్రికి చూపారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్, టౌన్‌ప్లానింగ్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీనిపై స్పందించిన మంత్రి మేడ్చల్ జిల్లా కలెక్టర్, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌లకు సిఫారసు చేశారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలపై ప్రత్యేక డ్రైవ్

సమీక్ష నిర్వహించిన అధికారులు



సమావేశంలో డీసీ ఆంజనేయులు, ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ పరిధి ఫుట్‌పాత్ ఆక్రమణపై ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు తెలిపారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేసుకునే వారు వెంటనే స్వచ్ఛందంగా ఆక్రమణలు ఎవ్వరికి వారు తొలగించుకోవాలని, లేదంటే తొలగిస్తామని హెచ్చరించారు. గ్రేటర్ కమిషనర్ ఆదేశాలను మేరకు త్వరలోనే ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్న సందర్భంగా ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేలా ముందస్తుగా వివిధ విభాగాల అధికారులు ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, టౌన్ ప్లానింగ్ ఏసీపీ, సూపర్‌వైజర్లతో కలిసి బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ ఫ్రీగా వెళ్లేలా అన్ని రహదారుల్లో ఫుట్‌పాత్‌ల ఆక్రమణను తొలగించనున్నట్లు తెలిపారు.

కుషాయిగూడలో పోలీసుల స్పెషల్ డ్రైవ్..

కుషాయిగూడ: కుషాయిగూడ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బుధవారం ఈసీఐఎల్ చౌరస్తా నుంచి చక్రిపురం చౌరస్తా వరకు డ్రైవ్ చేపట్టి ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసుకుంటున్న చిరు వ్యాపారులకు అవగాహన కల్పించారు. రోడ్లకు ఇరువైపులా వ్యాపారాలు చేయడం వల్ల పాదచారులు, వాహనదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై వారికి అవగాహన కల్పించారు. ఇబ్బందులు లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు.



చిరువ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అభివృద్ధి పనుల జాప్యంపై కార్పొరేటర్ ఆగ్రహం



లేక్‌పార్కు వద్ద గేట్ ఏర్పాటును పరిశీలించిన కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: మల్కాజిగిరి జీహెచ్ఎంసీ సర్కిల్ అధికారుల పనితీరుపై మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సఫిల్‌గూడ లేక్‌పార్క్ వద్ద జరుగుతున్న నూతన గేట్ ఏర్పాటు, ఫెన్సింగ్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విభాగం అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని, పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. పార్కు వద్ద ఉన్న టాయిలెట్స్ అధ్వానంగా ఉన్నాయని, గుర్రపు డెక్క కూడా తొలగించలేని పరిస్థితుల్లో ఉన్నాయన్నారు. ఒకే విభాగంలోని శానిటేషన్, ఇంజినీరింగ్, ఎంటమాలజీ అధికారుల మధ్య సమన్వయలోపం ప్రజలకు ఇబ్బందిగా మారిందన్నారు. పార్కుపైన వ్యర్థాలు పేరుకుపోయి దోమల బెడద అధికంగా ఉన్నా.. పట్టించుకునేవారే లేకుండా పోయారన్నారు. తగిన చర్యలు చేపట్టాలని, లేదంటే జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.

తీన్మార్ మల్లన్నపై ఫిర్యాదు

కుషాయిగూడ: రెడ్డిలపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ.. బుధవారం కుషాయిగూడ రెడ్డి సంఘం ప్రతినిధులు తగిన చర్యలు తీసుకోవాలని, కుషాయిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తీన్మార్ మల్లన్నకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మల్లన్నను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రెడ్డి సంఘం ప్రతినిధులు పైళ్ల హరినాథ్‌రెడ్డి, బొజ్జ రాఘవరెడ్డి, కాసం మహిపాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, మొగిలి రాఘవరెడ్డి, పద్మారెడ్డి, నరసింహరెడ్డి, సామ వెంకట్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చర్లపల్లి అగ్ని ప్రమాదంపై ప్రజాప్రతినిధుల సమీక్ష

- ప్రమాదంలో రూ.25 కోట్ల ఆస్తినష్టం



ఘటనా స్థలం వద్ద కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: చర్లపల్లి పారిశ్రామికవాడలో జరిగిన అగ్ని ప్రమాదం ప్రమాదవశాత్తే జరిగినట్లు తేలింది. ఇందుకు సంబంధించి ఓ సీసీ కెమెరాలో లభించిన ఆధారాలతో వాస్తవం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ఈ ఘటనపై సర్వోదయ కంపెనీ యజమాని బాల్‌రెడ్డి బుధవారం చర్లపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సర్వోదయ, ఫ్లోరోఎల్, డీవీపీఎస్ మూడు కంపెనీల్లో సుమారు రూ.25 కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపారు. కంపెనీలోకి ప్రవేశించిన బొలేరా వాహన వివరాలు ఇంకా లభ్యం కాలేదని, వాహన వివరాలు తెలిస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్నారు.

ఘటనా స్థలాన్ని సందర్శించిన కార్పొరేటర్..

చర్లపల్లిలో అగ్ని ప్రమాద ఘటనా స్థలాన్ని బుధవారం స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి సందర్శించారు. ఐలా చైర్మన్ రోషిరెడ్డితో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ప్రమాణాలు పాటించని పరిశ్రమలను మూసివేయాలి..

కనీస ప్రమాణాలు పాటించకుండా నిర్వహిస్తున్న పరిశ్రమలను మూసి వేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దమోదర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఘటనా స్థలాన్ని సందర్శించి మాట్లాడారు. కెమికల్ కంపెనీ నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. కెమికల్ కంపెనీల నిర్వహణపై దృష్టి సారించడంతో పాటు కార్మికులకు భద్రత కల్పించాలన్నారు. శంకర్‌రావు, నారా నర్సింహ్మ, నర్సింగ్‌రావు, స్వామి దాస్, శ్రీనివాస్ ఉన్నారు.

'హైడ్రా పేరుతో బెదిరిస్తే సహించేది లేదు'



సమావేశంలో మాట్లాడుతున్న డిఫెన్స్ కాలనీవాసులు

అల్వాల్: హైడ్రా పేరుతో భయభ్రాంతులను సృష్టిస్తే సహించేది లేదని నెరేడ్‌మెట్ డిఫెన్స్ కాలనీవాసులు అన్నారు. బుధవారం నేరేడ్‌మెట్‌లో పలువురు మాట్లాడుతూ.. డిఫెన్స్ కాలనీ సొసైటీ భూములను లీజుకు తీసుకుని నివసిస్తున్న వారిపై కొందరు కావాలని హైడ్రాకు ఫిర్యాదు చేసి స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కాలనీ సొసైటీ నూతన కమిటీలో కొందరు కబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ విషయంపై కో–ఆపరేటివ్ సొసైటీ ప్రధాన కార్యాలయంలో సైతం ఫిర్యాదు చేశామన్నారు. సొసైటీ మాజీ సభ్యులు తెలంగాణ ఓబీసీ సెల్ చైర్మన్ ఆవుల రాజుయాదవ్, బీజేపీ నేతలు ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



ఆందోళనలో బీసీ హక్కుల సాధన సమితి ప్రతినిధులు

ఉప్పల్: బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ఉప్పల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద సమితి ప్రతినిధులు ఆందోళన చేపట్టారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి బోడ్డుపల్లి కృష్ణ ఆధ్వర్యంలో తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో అందజేశామన్నారు. వారు మాట్లాడుతూ.. దేశ జనగణనలో కులగణన జరపాలని, పార్లమెంట్ సమావేశాల్లోనే బీసీలకు 50 శాతం, చట్టసభల్లో రిజర్వేషన్ల బిల్లుపెట్టి అమలు చేయాలన్నారు. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి రిమాండ్

అల్వాల్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన మురళీకార్తీక్ (19), నరేందర్ (21) శివారులోని ఓ విద్యాలయంలో డిప్లొమా చదువుతున్నారు. వీరు అల్వాల్‌లోని ఒక ప్రముఖ కళాశాలలో చదువుతున్నప్పుడు గంజాయిని అలవాటు చేసుకున్నారు. అది కాస్తా ఉపాధిగా మార్చుకున్నారు. ఖమ్మం నుంచి రమేష్ అనే వ్యక్తి నుంచి గంజాయిని తీసుకొచ్చి అల్వాల్ ఫాదర్ బాలయ్యనగర్‌లో నివాసం ఉండే హాస్టల్ వద్ద ఉంచి పలువురికి 10 గ్రాములు రూ.300లకు విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం నిందితులను అదుపులోకి తీసుకుని 600 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు



విద్యుత్ స్తంభాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ జెడ్‌టీసీ సమీపంలోని ఉప్పరిగూడ శ్మశానవాటిక అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. బుధవారం శ్మశానవాటికలో విద్యుత్ పోల్స్ ఏర్పాటు పనులను ఆయన పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. దెబ్బతిన్న ప్రహరీ స్థానంలో కొత్తదాన్ని నిర్మించి , అంతిమ సంస్కారాలకు వచ్చే వారికి తగిన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఏఈ వెంకటేష్, ఉమేష్‌సింగ్, కిషోర్, నరేష్, దీపక్, కై లాష్, జైహింద్, రాజాసింగ్ పాల్గొన్నారు.

పేదలకు న్యాయం చేయండి

భూముల క్రమబద్ధీకరణపై సీఎంను కలిసిన ఎమ్మెల్యే మర్రి



సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: నియోజకవర్గ పరిధిలోని పేద, మధ్యతరగతి ప్రజలకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో చాలామంది భూదాన్, యూఎల్‌సీ పరిధిలోని భూములు, దేవాదాయశాఖ భూముల్లో నివాసం ఉంటున్నారని, వారి ఇళ్లను 118 జీవో ప్రకారం రెగ్యులరైజేషన్ చేయాలని కోరామన్నారు. ఇటీవల ఏపీలో సింహాచల దేవాలయం భూముల్లో నివాసం ఉన్న వారి ఇళ్లను క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తే 278 సర్వే నెంబర్‌లో 22 కాలనీల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఇటీవల వక్ఫ్ బోర్డు కూడా పలు సర్వే నెంబర్లను నిషేధిత జాబితాలో ప్రకటించి ప్రజలను ఇబ్బందులకు గురిచేసిందని, ఆ సర్వే నెంబర్లలో నివాసమున్న వారికి కూడా న్యాయం జరిగేలా చూడాలని సీఎంను కోరినట్లు ఎమ్మెల్యే చెప్పారు.

కార్మిక చట్టాలను రద్దు చేయాలి





ఉప్పల్ రింగ్ రోడ్డు, ఈసీఐఎల్ చౌరస్తాలో నిరసన చేపడుతున్న కార్మిక సంఘాల నేతలు

కుషాయిగూడ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలను రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె. చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తాలో నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. మోదీ అధికారంలోకి వచ్చాక కార్మికులు సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా విభజించి అమలు చేసేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. కార్పొరేట్ శక్తులకు మేలు చేసే కోడ్ అమలు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శంకర్‌రావు, టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శివబాబు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, గణేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, వ్యవసాయ కార్మికులు, ఆల్ ఇండియా కమిటీల పిలుపు మేరకు బుధవారం ఉప్పల్ రింగ్ రోడ్డులో నిరసన చేపట్టారు. 4 లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని, రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర ఇవ్వాలని, సీఐటీయూ, టీయూసీఐ, ఏఐటీయూసీ కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. వెంకన్న, ఉర్మిళ, పరమేష్, జంగారెడ్డి, నాగరాజ్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై నిరసన



నిరసన ర్యాలీలో కార్మిక సంఘాలు

మల్కాజిగిరి: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను నిరసిస్తూ మల్కాజిగిరిలో సీఐటీయూ, ఏఐటీయూతో కలిసి కార్మిక సంఘాల నేతలు బుధవారం ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఈ బడ్జెట్ కేవలం ధనికుల లబ్ధికోసమే రూపొందించినట్లు ఉందని విమర్శించారు. కేంద్రం ఓటుబ్యాంక్ కోసమే బడ్జెట్ ప్రకటించిందని, బడ్జెట్‌లో మార్పులు జరిగేంత వరకు పోరాటం చేస్తామన్నారు. నాయకులు నర్సింగరావు, నారాయణరెడ్డి, కృపాసాగర్, గుంటి లక్ష్మణ్, నాగరాజు, సుమిత్ర, కృష్ణమూర్తి, సయ్యద్‌గౌస్, శంకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నల్సార్ క్యాంటీన్‌లో తనిఖీలు

శామీర్‌పేట్: హైదరాబాద్, శామీర్‌పేటలోని నల్సార్ లా యూనివర్సిటీ (హైదరాబాద్) క్యాంపస్‌లో మంగళవారం సాయంత్రం ఫుడ్ సేఫ్టీ, టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందాలు తనిఖీ చేశాయి. యూనివర్సిటీలో క్యాంటీన్ నిర్వహిస్తున్న శ్రీ గణేష్ క్యాటరర్స్‌పై ఫుడ్ సేఫ్టీ, టాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీ చేసి, స్టోర్‌రూమ్‌లో నిల్వ ఉంచిన బియ్యం, కూరగాయల వద్ద సరైన జాగ్రత్తలు పాటించకపోవడంతో నిర్వాహకులపై అసహనం వ్యక్తం చేశారు. ఆహారం తయారీ ప్రాంగణానికి రిజిస్టర్డ్ చిరునామాతో ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ పొందారని, ప్రోస్టాక్ సూపర్‌వైజర్లకు శిక్షణ ఇవ్వలేదని అధికారులు తెలిపారు. స్టోర్ రూంలో ఎలుకలు, బొద్దింకలు సంచరిస్తున్నట్లు గుర్తించారు. ఎలాంటి ప్యాకింగ్ లేకుండా ఆహార ముడిపదార్థాలను నేలపై పడేశారని, తయారీ తేదీ, గడువు ముగింపు తేదీ లేని 30 కిలోల పెసర్లను సీజ్ చేసి, నిర్వాహకులపై కేసు నమోదు చేశారు.

ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం





ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు

మల్లాపూర్: కేంద్ర బడ్జెట్‌పై మల్లాపూర్ డివిజన్ బీజేపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం మల్లాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు గూడురు శైలేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మల్లాపూర్ ఎలిఫెంట్ చౌరస్తాలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శైలేష్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌తో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ నేతలు అచ్చగోని శంకర్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, ముత్యంరెడ్డి, సీతాల విజయ్‌కుమార్, రవిగంగాధర్, కేశవరం యాదగిరి, ర్యాంకల సంతోష్, శ్రవణ్, ప్రకాష్, లక్ష్మారెడ్డి, మాధవి, నిర్మల, సబిత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్: ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టినందుకు అల్వాల్ సర్కిల్ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం అల్వాల్ ఈ–సేవా చౌరస్తా వద్ద ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద, మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగులు, మహిళలకు ఎంతో మేలు జరిగేలా ఉందన్నారు. బీజేపీ డివిజన్ అధ్యక్షులు అజయ్‌రెడ్డి, కార్తీక్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, సీనియర్ నాయకులు మాణిక్యరెడ్డి, మల్లికార్జున్‌గౌడ్, బాబి, అనీల్ యాదవ్, లక్ష్మణ్, శ్రీనివాస్, రాజిరెడ్డి, విక్రమ్, రామ్మోహన్‌గౌడ్, అనిల్‌రాజు, కరుణశ్రీ పాల్గొన్నారు.

స్థానిక బీజేపీ నేతలతో ఏబీవీపీ నాయకుల భేటీ



గౌతంనగర్: ఏబీవీపీ మేఘాలయ, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల నాయకులు బుధవారం గౌతంనగర్ డివిజన్ వాణినగర్‌లోని బీజేపీ నేత అనిల్‌ను ఆయన నివాసంలో కలిశారు. అనంతరం పలు విషయాలపై చర్చించారు. స్థానిక బీజేపీ నేతలు, ఏబీవీపీ నాయకులు ఉన్నారు.

మౌలాలి : అరుణాచల్‌ప్రదేశ్, మిజోరాం నుంచి వచ్చిన ఏబీవీపీ విద్యార్థులు మౌలాలి కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్‌ను కలిశారు. మిజోరం ఏబీవీపీ నాయకులు, బీజేపీ నాయకులు శివగౌడ్, శ్రీనివాస్‌యాదవ్, ఒగ్గు మురళీకృష్ణ తదితరులున్నారు.